క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం



తూర్పుపాలెంలో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న అభ్యర్థులు రాపాక, గొల్లపల్లి

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించింది. సమావేశంలో అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను వారిరువురు ఆత్మీయంగా పలకరించి, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి సమష్టి కృషి చేయాలని కోరారు. జెడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య, చేనేత విభాగం ప్రతినిధి జాన శంకరరావు, గుర్లింక సత్తిబాబు పాల్గొన్నారు.

27న వేంకటేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట: ఇసుకపూడి శివారు జక్కంశెట్టి వారిపాలెంలో ఈ నెల 27న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జక్కంశెట్టి గంగిశెట్టి స్థాపించిన ఆలయంలో బ్రహ్మశ్రీ ఎస్ఎస్‌వీవీ ఎల్ఎన్ శర్మ (బుజ్జి) పర్యవేక్షణలో శుక్రవారం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనము, పంచగవ్యప్రాశన, దీక్షాధారణ, గ్రామ ప్రదక్షిణ, వాస్తు పూజ, వాస్తు మండపారాధన, హోమం, పర్యంకగ్నీకరణం, వాస్తు బలి, జలాధివాసము జరిపించారు. 23న క్షేత్రపాలక మండపారాధన, హోమాలు, క్షేత్రాపాలక బలి, 24న నవగ్రహ మండపారాధన హోమాలు, చతుషష్టి సమేత మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి ఆరాధన, హోమాలు, జపాలు, 25న ప్రధాన దేవతారాధన, 26న ఆవాహిత మండపాలకు పునఃపూజ, హోమాలు జరుగుతాయన్నారు. 27న ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్న సమారాధన చేపట్టామన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఎంపీపీ కుండ అన్నపూర్ణ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పలు సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తాగునీరు తదితర సమస్యలపై ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల నియామావళి ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బోణం సాయిబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పెన్మెత్స బంగార్రాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మట్టపర్రులో ఆరోగ్య సురక్ష క్యాంపు



మట్టపర్రులో నిర్వహించిన ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు

మలికిపురం: మండలంలోని మట్టపర్రు ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్‌లో శుక్రవారం ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. క్యాంపులో 188 మంది రోగులు వివిధ విభాగాల్లో వైద్యులు నుంచి చికిత్స తీసుకున్నారు. 31 మంది రోగులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. 99 మంది రోగులకు లేబొరేటరీలో పరీక్షలు చేశారు. 105 మంది రోగులకు అవసరమైన మందులు సరఫరా చేశారు. క్యాంపులో వైద్యులు భవాని, చాముండేశ్వరి, అజయ్ మెహర్, హుస్సేన్ పాల్గొన్నారు. ఈ క్యాంపును ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు, బి.నరసింహమూర్తి పర్యవేక్షించారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

అంబాజీపేట: మండలంలో శుక్రవారం జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. గణిత పరీక్షకు సంబంధించి మూడు పరీక్ష కేంద్రాల్లో 485 మందికి 481 మంది హాజరయ్యారన్నారు. అంబాజీపేటలో 143కి 141, తొండవరంలో 159కి 158, పుల్లేటికుర్రులో 187కి 186 మంది పరీక్ష రాశారన్నారు. మూడు కేంద్రాల నుంచి నలుగురు విద్యార్థులు గైర్హాజరయినట్లు ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్‌లు తెలిపారు.

దోమ కాటు-ఆరోగ్యానికి చేటు

- పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ
- పరిశుభ్రతకు వైద్య, ఆరోగ్య సిబ్బంది కృషి
- 'డ్రైడే.. ఫ్రైడే'తో దోమల నివారణే లక్ష్యం



పలివెల గ్రామంలో డ్రైన్‌లో దోమల నివారణ మందు చల్లుతున్న పీహెచ్‌సీ హెచ్‌ఏ మాచరరావు

కొత్తపేట: వివిధ అనారోగ్య రుగ్మతలకు ప్రధానంగా దోమ కాటే కారణమని, గ్రామాల్లో ప్రతీ కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలు నివారించాలని వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు సూచించారు. దోమల నివారణకు ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ప్రతి శుక్రవారం డ్రైడే.. ఫ్రైడే కార్యక్రమం నిర్వహిస్తుంది. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే పలు వ్యాధులను నిరోధించవచ్చనే విషయాన్ని ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ప్రజలకు తెలియజేస్తున్నారు. పరిశుభ్రత విషయంలో ప్రజలను అప్రమత్తం చేసి తగు చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధులను దూరంగా ఉంచవచ్చని వివరిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, అంబాజీపేట, అయినవిల్లి మండలాల్లో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.రాజబాబు పర్యవేక్షణలో పీహెచ్‌సీల సిబ్బంది అన్ని గ్రామాల్లో డ్రైడే.. ఫ్రైడే కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

దోమ పుట్టుకను నివారించాలి

దోమ పుట్టుకను నివారిస్తే వ్యాధులు దరిచేరవని వైద్యులు చెపుతున్నారు. దోమకాటు ద్వారా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వంటి ప్రమాదకర వ్యాధులు సంక్రమిస్తాయి. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడేగా నిర్ధారించారు. దోమల వ్యాప్తి నివారణలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంటి పరిసరాల్లో ఉన్న చెత్త తొలగించడంతో పాటు మొక్కల కుండీలు, రాతి రుబ్బురోళ్లు, పాత టైర్లు, ప్లాస్టిక్ సామగ్రి, రిఫ్రిజిరేటర్లలో ఉన్న నీటి నిల్వలను తొలగింపచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. కదలిక లేని నీటి నిల్వలపై దోమలు లార్వా విడిచిపెడతాయని, ఆ లార్వా 8 నుంచి 10 రోజుల్లో గుడ్డుగా మారి తద్వారా దోమగా రూపాంతం చెందుతుందని ప్రజలకు వివరిస్తున్నారు. ఈ క్రమంలో వారానికోరోజు ఇంటి పరిసరాల్లో డ్రైడేగా పాటిస్తే దోమలను అరికట్టవచ్చనేది డ్రైడే ఫ్రైడే ముఖ్య ఉద్దేశం.

సంపూర్ణ పారిశుధ్య చర్యలు పాటించాలి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, పి.భవానీశంకర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం



"పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమాల ద్వారా ప్రతి ఇంటినీ సందర్శించి దోమల నివారణ గురించి వివరిస్తున్నాం. ఎక్కడైనా డ్రైన్స్ బాగుండకపోయినా, మూసుకుపోయి నీరు నిలిచిపోయినా సంబంధిత పంచాయతీ వారితో బాగు చేయిస్తున్నాం. ఈ డ్రైడే ఫ్రైడే కార్యక్రమం ప్రజా చైతన్యానికి దోహదపడుతుంది. సత్ఫలితాలు ఇస్తుంది."

ఎస్.రాజబాబు,
మలేరియా సబ్ యూనిట్ అధికారి, కొత్తపేట

దోమల వ్యాప్తి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు

- దోమను పుట్టనివ్వకూడదు.. కుట్టనివ్వకూడదు.
- ఇంటి కిటికీలు, తలుపులు, లెట్రిన్ పైపులకు మెస్ ఏర్పాటు చేసుకోవాలి
- దోమ తెరల్లో నిద్రించాలి.
- సాయంత్రం నుంచి శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులు వేసుకోవాలి.
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- తాగునీటి నిల్వలపై మూతలు వేయాలి.
- ఉపయోగించని సామగ్రిని బోర్లించి ఉంచాలి.
- వారానికోసారి వాడకం కోసం ఉంచిన నీటి నిల్వలను మార్చుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు ఉంటే వేస్ ఆయిలు పోయాలి.
- ఇంటి పరిసరాల్లో పనికిరాని టైర్లు, తాగి పారేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు లేకుండా చూసుకోవాలి.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



మామిడికుదురు మసీదులో జరిగిన నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల పవిత్ర రంజాన్ నెల రెండో శుక్రవారం భక్తి శ్రద్ధలతో నమాజ్‌లు జరిగాయి. మామిడికుదురు సున్నీ జామియా మసీదుతో పాటు షియా జామియా మసీదులో మత ప్రబోధకుడు తారిఖ్ అన్వర్ రజ్వీ, షబ్బర్ అలీజైదీ శుక్రవారం ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. మండలంలోని పెదపట్నం, మొగలికుదురు, కొమరాడ, మగటపల్లి మసీదుల్లో కూడా రంజాన్ నమాజ్‌లు జరిగాయి. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు. కమిటీల అధ్యక్షులు మసూద్ మొహిద్దీన్, ఫర్హత్ అలీబేగ్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

పి.గన్నవరం: విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించడంతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పి.గన్నవరం గ్రేస్ విద్యాసంస్థల డైరెక్టర్ నల్లి శ్రీచరణ్ అన్నారు. స్థానిక గ్రేస్ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్ ఈవెంట్స్ జరిగాయి. రన్నింగ్, కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీల్లో ప్రతిభ కనబరచిన 30 మంది విద్యార్థులకు నెహ్రూ యువకేంద్రం వలంటీర్ గాదంశెట్టి బేబీ సరోజని సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

హనుమత్, గజవాహనాలపై ఊరేగిన శ్రీవారు



రావులపాలెంలో వేంకటేశ్వరస్వామి వాహన సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, భక్తులు

రావులపాలెం: స్థానిక అలివేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 15వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం స్వామికి లక్ష్మీవేంకటేశ్వరస్వామి హోమం వైభవంగా నిర్వహించారు. తొలుతగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఉదయాన్నే సుప్రభాత సేవ, సహస్రనామార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతం స్వామిని హనుమత్ వాహనంపై గోవిందమాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వాడపల్లి కమలనాథ్ ఆచార్యుల ఆధ్వర్యంలో పలు పూజలు జరిపారు. సాయంత్రం చూర్ణోత్సవం నిర్వహించారు. రాత్రికి స్వామికి గజవాహనోత్సవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థాన పాలక మండలి చైర్మన్ పడాల పెద వెంకటరెడ్డి, ఇతర సభ్యులు పర్యవేక్షించారు. వాహనసేవలో పాల్గొన్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని స్వామివారి వాహన సేవలో పల్లకీని మోశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గొల్లపల్లిని కలసిన ఎమ్మెల్సీ



మలికిపురంలో అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లిని కలసిన ఎమ్మెల్సీ ఇజ్రాయెల్

మలికిపురం: స్థానిక కొల్లాబత్తుల కుమార్ ఇంటి వద్ద శుక్రవారం ఏపీ శాసనమండలి మెంబర్ బొమ్మి ఇజ్రాయెల్, రాజోలు అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలను వారు చర్చించారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని కోరారు.

సామాజిక న్యాయానికే పట్టాభిషేకం



గొల్లపల్లి ఆధ్వర్యంలో పొన్నమండలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

రాజోలు: రాబోయే ఎన్నికల్లో ప్రజలు సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే పట్టాభిషేకం చేస్తారని రాజోలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం రాజోలు మండలంలో పొన్నమండలో ఆయన పర్యటించారు. గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు, సిద్ధాంతాలపై నమ్మకంతో గ్రామానికి చెందిన డి.సురేష్‌కుమార్, ఎ.జోసఫ్, ఎ.సునీల్, ఎం.ఇజ్రాయిల్ తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. గొల్లపల్లి మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో నిలిపేందుకు ఎంతో మంది సామాన్యులకు సీఎం జగన్ అవకాశం కల్పించారన్నారు. ఎంతో మంది బీసీ, ఎస్సీ, మైనార్టీలకు రాజ్యాంగ పరమైన పదవులు కేటాయించి సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని గొల్లపల్లి పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి తెన్నేటి కిషోర్, కొల్లాబత్తుల కుమార్, స్టూడియో వర్మ, మోకా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి రథోత్సవం



మోరి వీధుల్లో సాగుతున్న రథయాత్ర

సఖినేటిపల్లి: మండలంలోని మోరిలో కొలువైన మహాలక్ష్మమ్మ, కనకమహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర, తీర్థ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహాలక్ష్మమ్మ అమ్మవారి రథయాత్ర ముప్పర్తి వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయం నుంచి అమ్మవారిని మంగళ వాయిద్యాలతో, బాణసంచా కాల్పులతో పూలతో శోభాయమానంగా అలంకరించిన రథంపైకి అధిరోహింపజేశారు. మోరి, మోరిపోడు గ్రామాల్లోని పురవీధుల్లో ఈ యాత్ర కొనసాగింది. యాత్ర పొడవునా భక్తులు అమ్మవారికి అరటిపళ్లు నైవేద్యాలుగా సమర్పించుకున్నారు. అలాగే రథానికి అరటిగెలలు, గుమ్మిడికాయలు కట్టించుకుని మొక్కులు తీర్చుకున్నారు. యాత్రలో దేవతామూర్తుల వేషధారణలు, శక్తి వేషాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సర్పంచ్ పసలపూడి లక్ష్మీ పద్మమంగతాయారు, చేనేత ప్రతినిధి జాన శంకరరావు, అత్యధిక సంఖ్యలో స్థానికులు, సరిహద్దు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

గ్రామీణ పేదల ఆరోగ్య రక్షణకు జాస్

ఆలమూరు: రాష్ట్రంలోని గ్రామీణ పేద ప్రజల ఆరోగ్య రక్షణకు, మెరుగైన చికిత్స కోసం ఈ ఏడాది జనవరి నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష (జాస్)ను ప్రవేశ పెట్టిందని ప్రత్యేక వైద్య నిపుణులు జి.దుర్గా ప్రసాద్, మేఘ స్పందన, నేత్ర వైద్య నిపుణురాలు పి.శ్రీలక్ష్మి అన్నారు. మండలంలోని చింతలూరులో శుక్రవారం జాస్ ఫేజ్-2 కార్యక్రమం జరిగింది. పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది సుమారు 187 మందికి వైద్య సేవలను అందించి మందులు అందజేశారు. అవసరమైన రోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య సలహాలు అందజేశారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న వారిని ఆరోగ్యశ్రీలో భాగంగా రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పంచాయతీ కార్యదర్శి సీహెచ్ వెంకటరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, హెల్త్ అసిస్టెంట్ ఆర్.నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ వి.సువర్చల, ఎంపీహెచ్‌ఏలు పి.కృష్ణవేణి, ఎస్.రాణి ప్రియదర్శిని, ఆరోగ్య మిత్ర నామాల రామకృష్ణ, ఆరోగ్య ఆశ సిబ్బంది, గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

నీటిని కలుషితం చేయవద్దు

రావులపాలెం: నీటిని ప్రతి ఒక్కరూ కలుషితం కాకుండా కాపాడుకోవాలని నీటి ఆవశ్యకతను తెలుసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కళాశాలలో ప్రపంచ జల (వాటర్) దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మనిషికి ప్రాణవాయువు ఆక్సిజన్ ఎంత అవసరమో నీరు కూడా అంతే ముఖ్యమైన అవసరమన్నారు. నీటిని ప్రతి ఒక్కరూ కలుషితం కాకుండా కాపాడుకోవాలన్నారు. అనంతరం నీటి భద్రత, వినియోగంపై ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్, హరిబాబు, సత్యమూర్తి, హేమలత, సౌజన్య, సిద్ధార్థ, యువరాజ్, రాజేంద్ర, పూజ పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో భాగంగా మాంగళ్యధారణ చేస్తున్న అర్చకులు

మామిడికుదురు: మాకనపాలెంలో కొలువుదీరిన అనంతలక్ష్మి, భూదేవీ సమేత సత్యనారాయణస్వామి 72వ వార్షిక దివ్య తిరు కల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. మద్దాల సతీష్, కాత్యాయని దంపతులు కల్యాణకర్తలుగా పాల్గొని స్వామి వారి వార్షిక కల్యాణాన్ని రమణీయంగా జరిపించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, కర్పూర పరిమళ సుగంధ ద్రవ్యాల పరిమళాలు, బాణసంచా కాల్పుల నడుమ స్వామి వారి కల్యాణం ఆద్యంతం కనులపండువలా నిర్వహించారు. మద్దాల దొరబాబు ముత్యాల తలంబ్రాలను స్వామి, అమ్మవార్లకు కానుకగా సమర్పించారు. ఉభయదేవేరులతో కొలువుదీరిన స్వామిని గురువారం రాత్రి గరుడ వాహనంపై ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం పలువురు భక్తులు స్వామి వారి వ్రతాలు ఆచరించారు. మొక్కులు, అభిషేకాలతో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆంజనేయ పుష్పక వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని వైభవంగా జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పని.. పనికి తగ్గ వేతనం



అవిడిలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీఓ ఆనంద్

కొత్తపేట: జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనిని ప్రతి ఉపాధి కూలీ కొలతల ప్రకారం చేయడం ద్వారా పనికి తగ్గ వేతనం అందజేయడం పథకం లక్ష్యమని ఉపాధి ఏపీఓ ఎ.ఆనంద్‌కుమార్ అన్నారు. మండలంలోని అవిడి పంచాయతీ కార్యాలయంలో ఉపాధి మేట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఓ ఆనంద్ మాట్లాడుతూ వచ్చే మూడు నెలల్లో 12 వారాల పాటు ఉపాధి కూలీలకు పని దినాలు కల్పిస్తామన్నారు. కొలతల ప్రామాణికంగా ఎంత పని చేస్తే అంత పనికీ వేతనం మంజూరు అవుతుందన్నారు. నేషనల్ మొబైల్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఎన్ఎంఎంఎస్) పనికి రాగానే మొదట ఫొటో అప్లోడ్ చేయాలన్నారు. అనంతరం మరో నాలుగు గంటల వ్యవధిలో మరో ఫొటో అప్లోడ్ చేయాలన్నారు. ఒక వేళ అటెండెన్స్ పడకపోతే వేతనం మంజూరు కాదన్నారు. అందువల్ల ప్రతి కూలీ తనకు నిర్దేశించిన పనిని సమగ్రంగా, పారదర్శకంగా పూర్తిచేసేలా మేట్లు పర్యవేక్షించాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్స్ (టీఏ), సీనియర్ క్షేత్ర సహాయకులు (ఎఫ్ఏ) శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు, పథకం నియమ నిబంధనలు, పని విధి విధానాల గురించి అవగాహన కల్పించారు.

ఓటర్లకు అవగాహన

రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఏపీఓ ఆనంద్ సూచించారు. గ్రామాల్లో ప్రజలందరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా చైతన్యవంతులను చేయాలని మేట్‌లకు సూచించారు. అనంతరం 'చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికి ప్రతి ఓటు విలువైనది ఓటింగ్‌లో పాల్గొందాం' అంటూ గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీఏలు వై.రవికుమార్, కె.రామచంద్రరావు, ఎఫ్ఏలు వాడ సూర్యప్రకాశరావు, జీవీవీ కిషోర్, సీహెచ్ రాజు, సీహెచ్ శ్రీహరి, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి



ఆలమూరులో ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారుల బృందం

ఆలమూరు: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని భారత రాజ్యాంగ వ్యవస్థను మరింత పటిష్ట పర్చాలని తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఓటర్లకు అవగాహన ర్యాలీలు, సదస్సులు జరిగాయి. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ ప్రోగ్రాం (స్వీప్) ద్వారా మండలంలోని ఆయా గ్రామాల్లోని ఓటర్లకు ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదన్నారు. ఏప్రిల్ 15 లోపు గ్రామాల్లోని 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరూ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ఓటర్లకు ఓటు హక్కు ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. ఓటర్‌గా నువ్వుంటే దేశం నీవెంటే అంటూ నినాదాలు చేశారు. ఆర్ఐ ఎం.జానకిరాఘవ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.వరలక్ష్మి, వీఆర్‌వోలు టి.అబ్బులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు అవగాహన సదస్సు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంకలో శుక్రవారం ఓటరు అవగాహన సదస్సు ఎస్సై ఎస్.రాము నిర్వహించారు. ప్రజలు శాంతియుతమైన వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ విషయంలో ఎవరు ఏ విధమైన ఆటంకం కలిగించినా తమ దృష్టికి తేవాలని ఆయన సూచించారు. కాగా మండలంలో సమస్యాత్మక గ్రామాలైన అంతర్వేదిపాలెం, టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో సాయుధ బలగాలతో ఎస్సై రాము కవాతు నిర్వహించారు.